క్లుప్తంగా

117 మంది ఉపాధ్యాయులు అవసరం

హిరమండలం: మండలంలోని మండల పరిషత్, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 117 మంది ఉపాధ్యాయులు అవసరమున్నట్లు గుర్తించామని ఎంఈఓ కె.రాంబాబు తెలిపారు. ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు త్వరలో జరగనున్నట్లు చెప్పారు. మండల పరిషత్ పాఠశాలలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు 6, పాఠశాల సహాయకులు 32, ఎస్జీటీలకు సంబంధించి 79 పోస్టులు మంజూరయ్యాయన్నారు. ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తయినవారు తప్పనిసరిగా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

21న ఆలయ భూముల వేలం

బూర్జ: ఈ నెల 21వ తేదీన మండలంలోని బూర్జలో ఉన్న శ్రీరాధాకాంత స్వామి దేవస్థానానికి సంబంధించిన భూములను (బూర్జ, మదనాపురం గ్రామాల పరిధిలో ఉన్నవి) మూడేళ్లకు పంటలు పండించేందుకు వేలం పాట వేయనున్నారు. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రవి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు మదనాపురం శివకేశం స్వామి క్షేత్రంలో బహిరంగ వేలం పాట వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు రూ. 2 వేలు ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. మదనాపురం గ్రామ పరిధిలో గల పలు సర్వే నంబర్లలో 22 ఎకరాల 82 సెంట్ల పల్లం భూమిని వేలం వేయనున్నట్లు తెలిపారు.

ఉపాధి వేతనదారుల నిరసన

జలుమూరు: తిమడాంలో ఉపాధి వేతనదారులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సీనియర్ మేట్ దురుసు ప్రవర్తన వల్ల పనులు చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఉదయం ఆరు గంటలకే పనిలోకి రావాలని ఇబ్బంది పెట్టడంతో 200 మంది వరకు పని చేయకుండా నిరసన వ్యక్తం చేసి అనంతరం వెనుదిరిగారు. పని చేసే సమయంలో ఒకరో, ఇద్దరో ఐదు, పది నిమిషాలు ఆలస్యమైతే అందరికీ పని లేకుండా చేయడం అన్యాయమన్నారు. ఈ విషయమై ఏపీఓ శేఖర్ వద్ద ప్రస్తావించగా.. వేతనదారులు సమయపాలన పాటించాలన్నారు. అదే సమయంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకొని పని చేయిస్తామన్నారు. ఇటువంటి సమస్య మరోసారి ఉత్పన్నం కాకుండా చూస్తానన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న రెడ్డి శాంతి

మెళియాపుట్టి: మండలంలోని గొప్పిలిలో కోదండరామాలయంలో మూడురోజులపాటు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూడో రోజున వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రివిలేజ్ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని స్వయంగా వడ్డించారు. రెడ్డి శాంతికి సీతారాముల జ్ఞాపికను కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లి జయసుధ, పల్లి యోగి, కొల్లాన ఇందిరాదేవి, కొల్లాన ఆనంద రావు, పోలాకి జయముని రావు, సవర సుభాష్, బమ్మిడి పున్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సత్తా..


తూలుగు మేఘన


బైరి జ్యోత్స్న

సారవకోట: మండల కేంద్రానికి చెందిన తూలుగు మేఘన బుధవారం విడుదలైన ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలో సత్తా చాటింది. బైపీసీ విభాగంగా ఆమె 291వ ర్యాంకు సాధించింది. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఆ ఫలితాలలో మండల కేంద్రానికి చెందిన బైరి జ్యోత్స్న 795వ ర్యాంకు సాధించింది. వీరిద్దరూ సారవకోటలోని నవతేజ పాఠశాలలో 10వ తరగతి చదివారు. అక్కడే ఈ రెండు ప్రవేశ పరీక్షలకు శిక్షణ తీసుకున్నారు.

బూర్జకు చేరుకున్న ప్రేమ పవాహిని రథం


రథోత్సవంలో పాల్గొన్న సాయిబాబా భక్తులు

బూర్జ: భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రేమ ప్రవాహిని దివ్య రథం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రయాణిస్తుందని సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు తెలిపారు. రథం మన్యం నుంచి బూర్జ మండలానికి బుధవారం చేరుకుందన్నారు. లక్కుపురం గ్రామంలో రథాన్ని ప్రారంభించారు. జిల్లాలోని గ్రామాల్లో రథయాత్ర చేపట్టడం జరుగుతుందని సంస్థ జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. జిల్లా గ్రామ సేవకులు ఎం.రవీంద్రబాబు, రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్ ఆర్.కిశోర్, ఎంపీపీ కర్నెన దీప, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు సాయమేదీ?

- కూటమి ప్రభుత్వంలో ఇంతవరకు అందని పెట్టుబడి సాయం
- ఖరీఫ్ పంటలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి..
- ఆర్థిక ఇబ్బందుల్లో రైతులు


వేసవి దుక్కులు చేస్తున్న రైతు

హిరమండలం: అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అన్నదాత సుఖీభవ పథకం పేరిట రూ.20 వేలు అందిస్తామని అప్పట్లో ప్రకటించారు. ఏడాది కావస్తున్నా ఇచ్చినమాట నిలబెట్టుకోలేదు. రబీ సీజన్ తుది దశకు చేరుకుంటుంది. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు రాష్ట్రాన్ని పలకరిస్తాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో రైతులు వేసవి దుక్కులు పూర్తిచేసి ఖరీఫ్ సేద్యానికి సిద్ధమవుతున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయ సీజన్ ప్రారంభంలోనే మార్గదర్శకాలను అనుసరించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసేవి. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులతోపాటు పెట్టుబడి సాయం అందించేవారు. కేంద్రం ఇచ్చే రూ.6వే లతోపాటు రాష్ట్ర ప్రభుత్వం వాటా (రైతు భరోసా) కింద రూ.18,500 అందించేవారు. ఈ మొత్తం ఖరీఫ్ ప్రారంభానికి ముందుగా మే నెలలో నేరుగా రైతు ఖాతాకు జమచేసేవారు. వీటితో పాటు వైఎస్సార్ పంటల బీమా, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ ఇలా ప్రతి దశలో రైతులకు ఆదుకుంది.

పాతపట్నం నియోజకవర్గంలో..

పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 56,028 వేల మంది రైతులు ఉన్నారు. ప్రతి ఏటా ఖరీఫ్‌లో వరి సాగుచేస్తుంటారు. వారికి సేద్యంపై గత వైఎస్సార్‌సీపీ నమ్మకం కల్పించి అండగా నిలబడింది. క్షేత్ర స్థాయిలో రైతులకు సేవలు అందించేందుకు విత్తనం మొదలుకుని పంట దిగుబడి, విక్రయం వరకు అన్ని విషయాలలోనూ తోడుగా నిలిచింది. ప్రతీ మండలంలో సచివాలయాలకు అనుసంధానంగా రైతు భరోసా కేంద్రాలను నిర్మించారు. ఈ కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులతోపాటు పెట్టుబడి సాయం రైతు ఖాతాలోకి జమచేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంతవరకు రైతు ఖాతాలో ఒక్కపైసా కూడా జమకాలేదు.

పాతపట్నం నియోజకవర్గంలో సాగుభూమి (హెక్టార్లు), రైతుల వివరాలు

మండలం	సాగు భూమి	రైతులు
పాతపట్నం	8,699	14,726
హిరమండలం	3,364	6,716
కొత్తూరు	10,374	13,914
మెళియాపుట్టి	7,741	12,235
ఎల్.ఎన్.పేట	4,464	8,487

మాటతప్పిన కూటమి..

టీడీపీ ప్రభుత్వం అధికాంలోకి వచ్చిన వెంటనే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఏటా అందిస్తామని హామీ ఇచ్చింది. ఇంతవరకు పైసా కూడా ఇవ్వలేదు. రైతులు తిరుగబడటంతో ప్రస్తుతం గ్రామాల్లో ఈ పథకాలకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతాయంటూ నాయకులు హడావుడి చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేదెన్నడో.. అర్హులను గుర్తించి నిధులు విడుదల చేసేదెప్పుడో అర్థంకాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

సాయం అందించాలి



ఈ ఏడాది రబీ సీజన్‌లో వేసిన పంటలు నష్టం మిగిల్చాయి. ఖరీఫ్ సీజన్ దగ్గరపడుతోంది. వేసవి దుక్కులకు చేతిలో చిల్లి గవ్వ లేదు. గత ప్రభుత్వంలో మేలోనే పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.

– లుకలాపు శ్రీనివాసరావు, రైతు, కిట్టాలపాడు

అప్పులు చేస్తున్నాం..



ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సిద్ధవుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల పొలాలను దుక్కులు చేస్తున్నారు. పెట్టుబడులు లేక బయట అప్పులు చేస్తున్నాం. ఈ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తోంది. నాయకులు మాత్రం ఈ నెల, ఆ నెలా పెట్టుబడిసాయం ఇస్తామని హడావిడి చేస్తున్నారు. ఎప్పుడు ఇస్తారో తెలియడంలేదు.

– కరణం శివరాం, రైతు, పింద్రువాడ

పరామర్శ..


నరసన్నపేట: కృష్ణవేణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం మాజీ ఉప సర్పంచ్ తాడేల కృష్ణవేణి ఇటీవల చింతువానిపేటలో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. కృష్ణవేణి చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, బొబ్బాది ఈశ్వరరావు, బగ్గు రమణయ్య, నేతింటి రాజేశ్వరరావు తదితరులు ఉన్నారు.


పాతపట్నం: ఈశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, నాయకులు

పాతపట్నంలో..

పాతపట్నం: మండల పరిధిలోని పెద్దదేవాంగుల వీధికి చెందిన నీలమణిదుర్గ ఆలయం మాజీ చైర్మన్ నూలు ఈశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం పరామర్శించారు. ఈశ్వరావు చిత్రపటానికి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సవిరిగాన ప్రదీప్, పార్టీ వైస్ ప్రెసిడెంట్లు గోకవలస రాము, టంకాల సుధాకర్, కార్యదర్శులు చింతాడ త్రినాథం, మజ్జి వరదరాజు, పెద్దింటి తిరుపతిరావు, వంశీ, ధనుంజయరావు, తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు చేపడతామన్నారు. ఉర్లాం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే చోడవరం ఫీడర్ పరిధిలో సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బైదలాపురం వంతెనకు..

గత ప్రభుత్వంలోనే నిధులు మంజూరు


నక్క తులసీదాస్

సారవకోట: మండలంలోని బైదలాపురం వంతెన నిర్మాణానికి గత వైఎస్సార్ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయని డీఎల్‌డీఏ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క తులసీదాస్ అన్నారు. బుధవారం బుడితిలో విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి నరసన్నపేట ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ చొరవతో కలెక్టర్ ప్రత్యేక నిధులు కేటాయించారన్నారు. అప్పట్లో రెండుసార్లు టెండర్లకు కోడ్ చేసినా ఎవ్వరూ ముందుకు రాలేదన్నారు. ఈలోగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. టీడీపీ నాయకులు తామే బైదలాపురం వంతెనకు నిధులు మంజూరు చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బుడితిలో ఏ ఒక్క నెలా రేషన్ సరుకులు సరిగా పంపిణీ చేయలేదని విమర్శించారు. రేషన్ సరుకులే సరిగా ఇవ్వలేని కూటమి నాయకులు బైదలాపురం వంతెనకు నిధులు మంజూరు చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. మండంలోని పలు గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. కూటమి నాయకులు ప్రచారమే తప్ప.. వాస్తవ పరిస్థితి ఆ విధంగా లేదన్నారు. ఇంతవరకు ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు.

పంచాయతీల అప్‌గ్రేడ్‌కు ప్రతిపాదనలు

కొత్తూరు: పంచాయతీలను మూడు రకాలుగా విభజించాలని ప్రభుత్వం నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాయానికి ఇదివరకే ఆదేశాలు అందాయి. ఈ మేరకు మండలంలోని 43 పంచాయతీలను ఈఓపీఆర్డీ వంతకుమార్ మూడు రకాలుగా విభజించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మండల కేంద్రం కొత్తూరును గ్రేడ్–1గా ప్రతిపాదించారు. కర్లెమ్మ, పారాపురం, దిమిలి, గొట్టిపల్లి, మాకవరం, నివగాం, కడుము, మదనాపురం, గురండి, కుంటిభద్ర పంచాయతీలను గ్రేడ్–2గా ప్రతిపాదించారు. మిగిలిన 32 పంచాయతీలను గ్రేడ్–3గా ప్రతిపాదించినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు.

మాతల వంతెనపై..

అడుగుకో గుంత


గజాలు బయటకు వచ్చిన మాతల-నివగాం వంతెన దుస్థితి

- బయటపడుతున్న గజాలు
- పొంచి ఉన్న ప్రమాదం

కొత్తూరు: మండలంలోని మాతల–నివగాం వంతెనపై (వంశధార నది) అడుగుకో గొయ్యి ఏర్పడింది. గజాలు బయటకు కనిపిస్తున్నాయి. రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గోతులు మరింత ఎక్కువైతే వంతెన పైనుంచి నదిలోకి పడిపోయే ప్రమాదం ఉంది. రెండు రాష్ట్రాలకు అనుసంధానంగా ఉండే ఈ వంతెన పైనుంచి బరంపురం, నవరంగపురం, గుణుపూర్, రాయగడ, హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రితో పాటు పలు పట్టణాలు, గ్రామాలకు ప్రతిరోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెన పైనుంచి అధిక లోడుతో ఒడిశాకు ఇసుక లారీలను తరలిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..

వంతెనపై ఏర్పడిన గోతులను పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం. మరమ్మతు పనులు త్వరలోనే చేపడతాం.

– గోపాలరావు, జేఈ, ఆర్అండ్‌బీ, కొత్తూరు

ప్రమాదకరంగా ఉంది..



ఆంధ్రా–ఒడిశా రాష్ట్రాలను కలిపే మాతల–నివగాం వంతెన నిర్వహణను అధికారులు పట్టించుకోవడం లేదు. వంతెనపై గోతులు ఏర్పడటంతో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. అధికారులు స్పందించి గోతులను వెంటనే పూడ్చాలి.

– అగతమూడి నాగేశ్వరరావు, కుంటిభద్ర, కొత్తూరు మండలం

వైభవంగా నీలమ్మ సంబరం


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఆమదాలవలస/ఆమదాలవలస రూరల్: మండలంలోని శ్రీనివాసాచార్యుల పేటలో గల గ్రామ దేవత నీలమ్మతల్లి సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం అసిరమ్మ పండగ నిర్వహించి, మరుసటిరోజు నీలమ్మ పండగలు చేశారు. గ్రామస్తులంతా ముర్రాటలతో అమ్మవారి గుడికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ గౌరీపతి, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అధ్వానంగా..



ఎల్.ఎన్.పేట మండలంలోని ఏబీ (అలికాం–బత్తిలి) రోడ్డు నుంచి ముంగెన్నపాడు గ్రామం వరకు ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. రెండు దశాబ్దాలకు పైగా ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవటంతో రోడ్డు మీద రాళ్లుతేలి గోతులమయంగా మారిపోయింది. ఏబీ రోడ్డు నుంచి ముంగెన్నపాడు మీదుగా సరుబుజ్జిలి మండలం మతలబుపేట గ్రామం వరకు ఉన్న ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్లలేని దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు, ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

బోరు బాగు చేయరూ..



ఎల్.ఎన్.పేట డలంలోని తురకపేట గ్రామంలోని పాత పెద్ద నుయ్యి వద్ద ఉన్న తాగునీటి బోరు గత కొన్ని నెలలుగా పనిచేయటం లేదు. వేసవి కావటంతో నీటి అవసరాలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బోరు బాగుచేయాలని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామీణ తాగునీటి విభాగం అధికారులు స్పందించి బోరు బాగు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– ఎల్.ఎన్.పేట

వరి వెద జల్లేందుకు సిద్ధం..



ఈ చిత్రం పాతపట్నం మండలంలోని బగంతరలో పొలాన్ని దుక్కి చేస్తున్న రైతు. ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఇటీవల వర్షాలు కురవడంతో వేసవి దుక్కులు చేస్తున్నారు. పాతపట్నం, కొరసవాడ, కాగువాడ, సీది, తామర, తీమర, ఎ.ఎస్.కమిటి, సింగుపురం, లాబర, గంగువాడ, సరాలి, చంగుడి తదితర గ్రామాల్లో వరి వెదలు జల్లేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మండలంలో ఏటా సుమారు 18 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుందని వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.

– పాతపట్నం

భారీ వర్షం..


ఆమదాలవలస: కొత్తవీధిలో మురుగును తొలగిస్తున్న స్థానికులు


ఆమదాలవలస: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా చేరిన వరద నీరు


ఎల్.ఎన్.పేట: మల్లికార్జునపురంలో ఏబీ రోడ్డులో చెట్టును తొలగిస్తున్న దృశ్యం


ఎల్.ఎన్.పేట: చింతలబడవంజలో పిడుగుపడి కూలిన పశువుల శాల


ఎల్.ఎన్.పేట: రోటరీనగర్ కాలనీలో నిలిచిన వర్షం నీరు


నరసన్నపేట: పట్టణంలో కురుస్తున్న వర్షం


మెళియాపుట్టి: చాపర గ్రామం వద్ద కురుస్తున్న వర్షం

ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతోపాటు భారీ వర్షం కురిసింది. పలుచోట్ల మామిడి కాయలు నేలరాలాయి. చెట్లు కొమ్మలు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రహదారులపై చెట్లు పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెరుపులు, పిడుగులు పడటంతో విద్యుత్ పరికరాలు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఇళ్లు పాడయ్యాయి. కొద్ది రోజులుగా ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు వర్షం కురవడంతో సేద తీరారు.

– సాక్షి నెట్‌వర్క్